# పాలు - లోపాలు - పాపాలు

"ఆదినారాయణ నడిగి అర్జంటుగా అరలీటరు పాలు తెచ్చిపెట్టు" అని పురమాయిస్తోంది మా మేనకోడలు విజయ; మేం కూర్చున్న గది బయట.

"డయిరీ ఫారం పాలు వచ్చేవేళ అయిందిగా" అంది మా ఆవిడ విజయ లోపలికి రాగానే.

"అబ్బో! ఆ బూతెక్కడో లలితానగర్‌లో వుంది. ఆదినారాయణ ఇక్కడే బి-27 వెనకాల పాకలో వుంటాడు."

"మీ కాలనీలో పాలబూత్ లేదూ?" అన్నాను. ఆశ్చర్యం, కోపం కలిపి లేదంది విజయ.

నాకు కసి బయల్దేరింది. చక చకా కాలనీ అంతా తిరిగాను. మొత్తం ఏడువందల ఇరవై యూనిట్లున్నాయి ఆ క్వార్టర్సులో. క్లాస్ వన్ నుంచి ఫోర్ దాకా అధికార్లు, ఉద్యోగులు వున్నారు. లలితా నగర్‌కి దగ్గిరగా వున్న వాళ్ళు బూత్‌కి వెళ్ళి తెచ్చుకుంటున్నారు. మిగిలిన వాళ్ళందరికీ ఆదినారాయణ, పోలమ్మ, సత్తెయ్య, పుల్లయ్య మొదలైనవాళ్ళు కాలనీలోనే పాకలు వేసుకుని కనిపెట్టుకుని వుండి పాలు పోస్తున్నారు.

క్లబ్ కెళ్ళాను. అక్కడ పాతమిత్రులు అచ్యుతరామయ్య, వెంకన్న కనబడ్డారు. వాళ్ళతో మాట్లాడాను. "మీలో కొందరు సంత కాలుపెట్టి ఒక కాగితం (మూడు కాపీలు) యివ్వండి. పదిహేను రోజులలో బూతు నిర్మించేటట్టు చేస్తాను" అన్నాను. నిమిషాలమీద మహజరు మూడు కాపీలు టైపుచేసి అరవై రెండేసి సంతకాలతో యిచ్చారు. "ప్రభుత్వం వారు డయిరీపెట్టి పాలు, వెన్న, నెయ్యి, డ్రింక్సు తయారుచేసి పొట్లాలలో, డబ్బాలలో, సీసాలలో సీళ్ళువేసి ఆరోగ్యకరంగా సరఫరాచేస్తూ వుంటే మీరంతా అప్పల నరసమ్మల పాలు తాగడం బాగాలేదు. చుట్టపు చూపుగా జగన్నాధం గారింటికొచ్చి, అనుకోకుండా మీకీ ఉపకారం చేస్తున్నందుకు గర్వంగా వుంది" అన్నాను.

మా ఆవిడ నాకోసం రెండు గంటలనుంచి వెయిట్ చేస్తూ

వుంటుంది, అని గుర్తొచ్చింది. అంచేత ఉపన్యాసం కొద్దిలో తేల్చి వేశాను. లేకపోతే—పాలు, వెన్న, రోజ్‌మిల్క్, చిలుకర్దు మొదలైన డయిరీ ప్రొడక్ట్సును గురించి చాలాసేపే మాట్లాడగలను.

మర్నాడు ఆఫీసులో కాగితం ప్రాసెస్ చేసేను. "పూటకి ఏడు వందల నుంచి పధ్నాలుగు వందల నలభై పాల పొట్లాల వరకు సేల్సు పొటెన్షియల్ వుంది. కనుక పదిహేను రోజులలో ఆ కాలనీలో పర్మనెంటు పాలబూత్ నిర్మించే విధంగా శాంక్షన్ తీసుకుని సీట్లో కొచ్చాను. ఆ డిపార్టుమెంట్ అధికారికి బూత్ కట్టడానికి స్థలం, పర్మిషన్ కావాలంటూ లెటర్ తయారుచేసి, మా ఎం. డి. గారి సంతకం చేయించాను. ఆ రోజే డిశ్పాచ్ చేయించి ఊపిరి తీసుకున్నాను.

ఉత్తరానికి జవాబు మర్నాడే వచ్చింది. "మీ ఉత్తరం కాపీ ఒకటి మా హెల్త్ ఆఫీసర్‌గారికి పంపాము. వారి అభిప్రాయం తెలుసు కొని మీకు కడసారి సమాధానం వ్రాయగలము."

అంతే!

నెల్లాళ్ళయిపోయింది.

హెల్త్ ఆఫీసర్‌గారి నుంచి డిపార్టుమెంట్ అధికారికి సమాధానం రాసినట్టులేదు. మా ఉత్తరానికి వారి సమాధానమూ లేదు.

ఈ లోపుగా నా కసి కొంచెం తగ్గిందంది మా ఆవిడ. లేదన్నా నేను అని నెల తిరిగిన మర్నాడే నేను ఆ హెల్త్ ఆఫీసర్‌గారి ఆఫీస్‌కి వెళ్ళాను. వారు లేరు. సూపరింటెండెంట్‌తో 'డిస్కస్' చేసేను.

"మీకు పర్మిషన్ యివ్వడానికి వీలుపడదు సార్! ఎందుకంటే మాది ప్రత్యేకమైన కాలనీ. మా ఆస్పత్రి వేరు, మా స్కూళ్ళు వేరు, మా పార్కులు వేరు, మా శానిటరీ సిస్టం వేరు" అన్నారాయన.

అచ్యుతరామయ్య చెప్పాడు. ప్రస్తుతం కాలనీలో వాళ్ళకి పాలు పోస్తున్న ఆదినారాయణ, పోలమ్మ, సత్తెయ్య, పుల్లయేత్యాదులు పాహిమాం అంటూ హెల్తు ఆఫీసర్‌గారిని, వారి సిబ్బందిని ఆశ్రయించారుట. పాలముంచినా నీటముంచినా నీదే భారం అన్నారుట. మీ గడపలో మీగడ పడేసినంత పొట్టు అన్నారుట.

"మా డయిరీ ఫారం పాలు శుద్ధిచేసి, ఆరోగ్యకరంగా యిస్తాం. మేం సరఫరా చేస్తున్న పాలు లక్షలకొద్దీ జనాభా వున్న ఈ నగరంలో ఇతర ప్రాంతాలవారు అందరూ తీసుకొంటున్నారు. పైగా ఈ పోలయ్యలూ, పుల్లమ్మలూ యిచ్చే పాలే అనారోగ్యకరంగా వుండొచ్చు కదా" అన్నాను వ్యథతో.

"ఉండొచ్చు, అన్నీ నిజమే."

"మరి మా కెందుకివ్వరు పర్మిషను ?"

"అప్పుడెప్పుడో మీ డయిరీ ఫారం పాలసీసాలో యెలక వచ్చింది గుర్తుందా ? పోతే, మొన్న లలితానగర్ బూతులో పొట్లా లకి గుండుసూదితో చిల్లులు పొడిచి (ఒక పొట్లానికి ఒకే చిల్లు) పూటకి బకెట్ పాలు అంటే పది లీటర్లు దాచుకోవడం, విడిగా అమ్ము కోడం కళ్ళారా చూసి రిపోర్టు చేశారు."

"పొట్లానికి చిల్లు పొడిచి పాలు తీసేస్తే పాలు తగ్గిపోయి, పొట్లాం తీసుకోమని నిరాకరించవచ్చు కదా" అన్నాను.

"వెనక ఒక జోక్ చదివాను. దుకాణంలో ఒక ఏడెనిమిదేళ్ళ పాప కూర్చుందిట. ఒక ఆసామి ఏదో కొనడానికొచ్చి అమ్మలూ, ఇక్కడ యిన్ని రకాల పిప్పరమెంట్లు వున్నాయి కదా; నీకు తినాలని అనిపించదా అని అడిగాట్ట. దానికి ఆ పాప 'తింటాగా' అందిట. 'మరి ఎక్కువ తక్కువ వస్తే మీ నాయిన కొట్టడా?' అని అడిగాట్ట ఆసామి. 'లెక్క తక్కువ వచ్చేట్టు నే నెందుకు తింటాను. ఒక్కొ క్కటి తీసి, కాస్త కాస్త చప్పరించి మళ్ళా సీసాలో పడేస్తాగా?' అందిట ఆ గడుసుపిల్ల. అలాగే బూత్‌లో కొచ్చిన ప్రతి పొట్లానికీ ఒక చిన్న చిల్లు పొడిచి కొద్దిగా నొక్కుతారన్నమాట. ఇంజక్షన్ సీసాడు పాలు పితుక్కుంటే చాలు, కొనుక్కొనే వారికి తెలీదు. పూటకు పది లీటర్లు పాలు మిగుల్తాయి. అంటే రోజుకి నలభై రూపా యలు."

కాలనీలో పాలబూత్ పెట్టడం మాట తర్వాత చూడొచ్చు. ముందు ఈ దురాచారం ఆపాలి, అనుకుంటూ బయలుదేరాను.

(13-10-79)